6న అంబేద్కర్ స్మారకోపన్యాసం

హిమాయత్‌నగర్,డిసెంబర్ 2: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 6న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అంబేద్కర్ జీవితం, ఆశయం –విజయాలు అనే అంశంపై 39వ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్న జాతుల అభ్యున్నతి కోసం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం రక్షణ కవచంలా నిలుస్తోందని, బహుజనులు ఐక్యతతో ముందుకు సాగి వారి హక్కులను సాధించుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తొలి మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్యతో పాటు పలువురు వక్తలు హాజరై ప్రసంగిస్తారన్నారు.

రేపు జరిగే సదస్సును విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్,డిసెంబర్ 2: అంతర్జాతీయ కార్మికోద్యమ చరిత్ర– నేటి పరిస్థితులు అనే అంశంపై ఈ నెల 4న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సుకు కార్మికవర్గం అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని సోమవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు.ఈ సదస్సుకు ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు జార్జియోస్ మావ్రికోస్,డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వదేశ్ దేవ్ రాయ్,ఏఐబీఈఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షుడు చుక్క రాములు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు

అంబర్‌పేట : ఛే నంబర్ ఫ్లై ఓవర్ ని ర్మాణం నత్తనడకతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరమణ చౌరస్తా నుంచి ఛే నంబర్ వరకు రహదారి బంద్ కావడంతో సమస్య తలెత్తుతున్నది. ఇక్కడ లైట్ వెహికిల్స్‌ను అనుమతిస్తే కొంత సమస్య తీరుతుంది. సోమవారం ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ లెనిన్‌బాబు, టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది శ్రీరమణ చౌరస్తా నుంచి ఛే నంబర్ వరకు లైట్ వెహికిల్స్ అనుమతి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఛే నంబర్‌లో సిగ్నల్స్ ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు అనుమతిస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని చర్చించారు.

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఉదయం 8 నుంచి 9 గంటల వరకు,సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్పెషల్ తరగతులు
- ఈ నెల 31 వరకు సిలబస్ పూర్తిచేయాలి

జూబ్లీహిల్స్,డిసెంబర్2 : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పది విద్యార్థులకు మూడు నెలలుగా సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్‌సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (మార్చి–2025) కు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్పెషల్ క్లాస్‌లు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఉత్తీర్ణత సాధించేందుకు ఉదయం 1 గంట, సాయంత్రం 1 గంట అదనపు క్లాసులు నిర్వహిస్తూ డిసెంబర్ 31 వరకు సిలబస్ పూర్తిచేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యార్థులకు జనవరి నుంచి స్పెషల్ రివిజన్ క్లాస్‌లు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేయనున్నారు. ఇందులో భాగంగా జనవరిలో స్పెషల్ రివిజన్ టెస్ట్‌లు, ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్–1, ప్రీ ఫైనల్–2 పరీక్షలు సైతం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం (2024–25) మార్చిలో జరుగనున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తున్నారు. ఆయా సబ్జెక్ట్‌లలో పరీక్షలు నిర్వహించి తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు.



యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

జూలై నుంచే ప్రత్యేక తరగతులు

యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో 171 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. దీంతో తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాలకు 5 సెక్షన్‌లుగా బోధన అందిస్తున్నాము. పాఠశాలలో షిఫ్టుల పద్ధతిలో తరగతులు నిర్వహిస్తున్నందున జూలై నుంచే ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నాము. విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టేందుకు ప్రతివారం ఆయా సబెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించి ఆయా పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

– పరమేశ్వరమ్మ, హెచ్ఎం, యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ ప్రభుత్వ పాఠశాల

తక్కువ మార్కులు వచ్చిన వారిపై స్పెషల్ ఫోకస్..

పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ప్రత్యేక తరగతులు ప్రారంభించాం. ఖైరతాబాద్ మండలంలోని 17 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే సాయంత్రం ఒక గంట అదనపు తరగతులు నిర్వహిస్తున్నాము. అన్ని పాఠశాలల్లో డిసెంబర్ 31 వరకు సిలబస్ పూర్తిచేస్తాం. ఆయా పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చిన వారిపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నాము. విద్యార్థులను వార్షిక పరీక్షలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దాతలు ముందుకొస్తే విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తాం.

శామ్యూల్‌రాజ్, డిప్యూటీ డీఈఓ, ఖైరతాబాద్ జోన్

సన్మానం: బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా 20 ఏండ్ల పాటు సేవలందించిన ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగింది. తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి హరీష్‌రావు అధ్వర్యంలో జరిగిన ఈ వీడ్కోలు కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలున్నారు. – బండ్లగూడ, డిసెంబర్ 2

కాంట్రాక్ట్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

ఖైరతాబాద్, డిసెంబర్ 2 : నిమ్స్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని సీఐటీయూ అనుబంధ నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎం. వెంకటేశ్ డిమాండ్ చేశారు. నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇస్తున్న వేతనాలలో ఫిక్స్‌డ్ అలవెన్సు రూపంలో ఇస్తున్న రూ.1,445ను గ్రాస్ జీతంలో కలపాలని, కాని అందుకు విరుద్ధంగా జీతాలు ఇస్తున్నారన్నారు. సకాలంలో వేతనాలు రాక వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

వెంగళరావునగర్, డిసెంబర్ 2 :ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్ఓ) డా.వెంకటి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతీ వైద్యశాలలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.వెంకటి మాట్లాడుతూ..ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పకడ్బందీ ద్వారా ఎయిడ్స్ మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించగలిగామన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డా.మురళీధర్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.సంజీవులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దవాఖాన వైద్య నిపుణులు, నర్సింగ్ సిబ్బంది,వైద్య విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నిర్వహించిన ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.

ఎర్రగడ్డ ఛాతీ దవాఖానలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ..పాల్గొన్న జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్ఓ) డా.వెంకటి

ప్రజావాణికి ఆదరణ కరువు

జూబ్లీహిల్స్,డిసెంబర్ 2 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతివారం నిర్వహించే ప్రజావాణికి ఆదరణ కరువైంది. కొంతకాలంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఈ కార్యక్రమానికి ఫిర్యాదులు రావడంలేదు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

అడ్డగుట్ట, డిసెంబర్ 2: వాహనాన్ని నడిపేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని చిలకలగూడ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులుతో కలిసి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపరాదని ఆయన తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని, తద్వారా ప్రమాదం జరిగిన ప్రాణాలను కాపాడుకోవడానికి అవకాశాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో శివపార్వతుల కళ్యాణం

ప్రతియేటా కార్తీక మాసం ముగిసిన తర్వాత నిర్వహించే శ్రీ శివ పార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని శివాలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో జరిపించారు. కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు. పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సీతారామశర్మ,ఈవో జయరామయ్య, యోగేష్ తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్,డిసెంబర్ 2

డీడీఎంఎస్‌లో వొకేషనల్ కోర్సులకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ వొకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని వివరించారు. రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ , మెడికల్ ల్యాబ్, క్యాథ్‌ల్యాబ్, పర్‌ఫ్యూజన్, కార్డియాలజీ టెక్నీషియన్స్,రేడియోగ్రఫీ అసిస్టెంట్ వంటి పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని, ఈనెల 14 వరకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8309037 134, 6305895867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నెలల తరబడి.. అదే నిర్లక్ష్యం

రోడ్డుపై వృథాగా గ్యాలెన్ల కొద్ది తాగునీరు పట్టించుకోని అధికారులు

అసలే రోజు విడిచి రోజు నీటి సరఫరా...ఒక్కోసారి రోజులు గడుస్తాయి...వచ్చే ఆ నీరు కూడా సక్రమంగా ప్రజలకు అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖైరతాబాద్ చింతలబస్తీలో నడి రోడ్డుపై రక్షిత మంచినీరు సరఫరా అయ్యే పైపులైను పగిలి రోడ్డుపై గ్యాలెన్ల కొద్ది నీరు నెలల తరబడి వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వాటర్ వర్క్స్ శాఖకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మంచినీటి వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. – ఖైరతాబాద్, డిసెంబర్ 2

ఏఎన్ఎం పోస్టుల సంఖ్యను పెంచాలి

రెండవ ఏఎన్ఎంల ధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ

సుల్తాన్‌బజార్ : ఏఎన్ఎం పరీక్షకు సంబంధించి 1931 పోస్టులను పెంచడంతో పాటు వయస్సు రిత్యా పరీక్షలకు అర్హత లేని వారికి వందశాతం గ్రాఫ్ శాలరీతో పాటు పది లక్షల రూపాయల లైఫ్ టైం గ్రాట్యూటి ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చే శారు. సోమవారం కోఠిలోని నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రెండవ ఏఎన్ఎంల ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. 18 ఏండ్లుగా ఎన్‌హెచ్ఎంలో తక్కువ వేతనంతో పనిచేస్తున్న వీరి సేవలను ప్రభుత్వం ఉపయోగించుకుందని, కాంట్రా క్టు పద్ధతిలో పని చేసి చివరికి రిటైర్మెంట్ సమయంలో ఆ నెల జీతం తీసుకొని వెళ్లాల్సిన స్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.4వేల జీతం నుంచి పనిచేస్తూ వచ్చారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు తన్వీర్ సుల్తాన, కె. పద్మ, సరోజ, సహాయ కార్యదర్శులు లత, గోపమ్మ, సంధ్య, హారతి, గుణవతి, తులసి, రాష్ట్ర సమితి సభ్యులు సునీత, స్వాతి, గిరిజారెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

చిన్నగోల్కొండ సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ దవాణాకర్‌గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 2 : రైతుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చిన్నగోల్కొండ సహకార సంఘం చైర్మన్ దవాణాకర్‌గౌడ్ తెలిపారు. సోమవారం చైర్మన్ అధ్యక్షతన పాలకవర్గ సభ్యులు, రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు అవసరమైన రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. సహకార సంఘం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన భైకని వెంకటేశ్,కొత్త లక్ష్మారెడ్డి,ఎం కుమార్, సురేందర్, శంకరయ్యలతో పాటు పలువురికి దీర్ఘకాలిక రుణాలను రూ.18లక్షలకు పైగా పంపిణీ చేశారని తెలిపారు. రైతులు వారు తీసుకున్న రుణాలతో వ్యవసాయ పనులు చేసుకొని ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మంచర్ల మోహన్‌రావు,దేవేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బాల్యనాయక్,రూప, విజయలక్ష్మి,సీఈవో యాదయ్య,సిబ్బంది సురేష్, మధుమతి, జగపతిబాబులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ దుస్తులు వితరణ

అమీర్‌పేట్: యూఎస్‌లో ఉంటున్న ఎస్ఆర్‌నగర్‌కు చెందిన అను తిరుమల తన తల్లి అరవిందమ్మ సార్మ కార్థం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 25 వేల ఖరీదు చేసే దుస్తులను ఆర్ ఎంవో డాక్టర్ వినాయక్‌కు అందజేశారు. ఆపరేషన్ థియేటర్‌లో వైద్యులు, సిబ్బంది, రోగుల కోసం ఈ దుస్తులు ఉపయోగపడతాయని డాక్టర్ వినాయక్ అన్నారు. ఎన్ఆర్ఐ అను తిరుమలకు కృతజ్ఞతలు తెలిపారు.

'అందరికి స్వచ్ఛమైన గాలి'పై సదస్సు

అమీర్‌పేట్, డిసెంబర్ 2: జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంలో భాగంగా సోమవారం ఎర్రగడ్డలోని డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల సహకారంతో కళాశాల ఆడిటోరియంలో సదస్సు జరిగింది. ప్రజారోగ్యం, పర్యావరణంపై కాలుష్య ప్రభావం, ఈ పరిణామాలను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలువురు వక్తలు ప్రసంగించారు. ఇందుకు ఏకో ఫ్రెండ్లీ విధానాలను అందిపుచ్చుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించడం, నీటి వనరుల పరిరక్షణ, పెద్దయెత్తున మొక్కల పెంపకం, ప్రజా రవాణా వ్యవస్థ, ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం వంటి అంశాలపై వైద్య కళాశాల విద్యార్థులు ప్రసంగించారు. ఈ సదస్సులో టీజీపీసీబీ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వర్‌రావుతోపాటు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రమాదేవి, ప్రొఫెసర్, అకాడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యశోద, ద్రవ్యగుణ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఎ.విజయలక్ష్మి, స్వస్థవృత్త విభాగం హెచ్‌వోడీ డాక్టర్ పి.రవీందర్‌గౌడ్, ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతం, పీజీ స్కాలర్ డాక్టర్ ఉపుల్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పర్యావరణ హిత ఉత్పత్తులను అందజేస్తున్న టీజీపీసీబీ అధికారులు

రోడ్డు పనులు పరిశీలన

రాంనగర్ డివిజన్ హరినగర్, కృష్ణానగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పరిశీలించారు. పనులు సాగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. – ముషీరాబాద్

శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించాలి

ముషీరాబాద్, డిసెంబర్ 2: భవిష్యత్ తరాల కోసం శాస్త్రీయ కళారూపాలను ప్రోత్సహించాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బూర్గుల మధుసూదన్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ నాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ నాట్యకళా వైభవం పేరిట మెగా నాట్య కళాకారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నృత్య కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు. సంస్థ నిర్వాహకులు డాక్టర్ రంజిత్, జేఎన్ రాజేంద్ర, మూసా అలీ ఖాన్, బిక్కునాథ్ నాయక్, వసంతరాయలు, భాస్కర్ గుప్తా, రాఖి,విజయ,మధు, ప్రశాంతి, భరణి, రమేశ్, అనూష, తేజశ్రీ పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణ కోసం నిరంతర పోరాటం

చిక్కడపల్లి, డిసెంబర్ 2: ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యే వరకూ నిరంతరం పోరాటం చేయాలని పలువురు మాదిగ నాయకులు పిలుపునిచ్చారు. మాదిగల ఐక్య సంక్షేమ సంఘం(మాస్)ఆధ్వర్యంలో పార్టీలకు, సంఘాలకు అతీతంగా సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర విస్తృత సామావేశం నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిటైడ్ ఐఆర్‌టీఎస్ అధికారి అప్పికట్ల భరత్ భూషణ్, బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, ఓయూ రిటైడ్ ప్రొఫెసర్ ముత్తయ్య, వీసీకే పార్టీ అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ప్రొఫెసర్ నితానియల్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద సంఖ్య కలిగిన మాదిగ కులానికి నేడు తెలంగాణలో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు సంఘాలకు అతీతంగా మాదిగ జాతిని ఏకం చేసే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. గూడు లేని పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టే వరకు పోరాటం చేయాల్సి అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో వశపాపక నరిసంహ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.